నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 23 జూన్ 2025 | JAGTIAL

# కరీంనగర్ సమగ్రాభివృద్ధికి సహకరించండి

- పెండింగ్ పనులకు నిధులు కేటాయించండి
- ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలం
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కలెక్టరేట్, జూన్ 22: కరీంనగర్ సమగ్రాభివృద్ధికి సహకరించాలని, పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఇన్‌చార్జి మంత్రిగా మొదటిసారి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదివారం కరీంనగర్‌కు రాగా, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వ్యవసాయం, విద్య, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, సంబంధితశాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి తుమ్మల కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల మాట్లాడారు. దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా కరీంనగర్‌లో నిర్మించిన తీగల వంతెన నిర్వహణపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదని, డైనమిక్ లైట్ల వినియోగం లేకపోవడంతో వంతెన కళ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణ పనుల్లో కూడా వేగం లోపించిందని, కొద్ది నెలల నుంచి ఈ మందకొడిగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులైన ఈ రెండింటిని సత్వరమే పూర్తి చేయకపోవడం సరికాదని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన రోడ్ల పనుల్లో కొన్ని పూర్తికాగా, మరో 125వరకు రహదారులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. సీఎం అస్యూరెన్స్ కింద విడుదలైన ₹350కోట్లు సరిపోకపోవడంతో మిగతా రహదారుల పనులు పూర్తి కాలేదన్నారు. వెంటనే వాటికి నిధులు విడుదల చేయాలని, వచ్చే సమావేశం నాటికి పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలపై అధికారులు రైతులకు వివరించడం లేదన్నారు. ఎకరా భూమిలో వరి సాగు చేస్తే వచ్చే లాభం కన్నా రెండింతలు ఒకేసారి వస్తుందనే అంశంపై చెప్పాలన్నారు. పంట కాతదశకు వచ్చే దాకా మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని.. ఆ తర్వాత 30ఏండ్ల వరకు ఎలాంటి పెట్టుబడి లేకుండా టన్నుల కొద్ది గెలలు పొందవచ్చనే అంశాన్ని రైతులకు తెలియజేస్తే.. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మళ్లే అవకాశాలు ఉంటాయన్నారు. ఆయిల్‌పామ్ గెలలు కోయడంలో కూడా ప్రభుత్వం సరైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## అరుదైన పురాతన నాణేలు లభ్యం



కోటిలింగాలలో లభ్యమైన పురాతన నాణేలు

వెల్గటూర్, జూన్ 22: వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గుమ్మల వెంకటేశ్ ఆదివారం చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా, కోటిలింగాల గోదావరి ఒడ్డున కొన్ని నాణేలు కనిపించాయి. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా.. వాటిని తీసుకొని వెల్గటూర్‌కు చేరుకున్నాడు. పలువురికి చూపించి పరీక్షించగా, అవి బంగారం కాదని తేలింది. అప్పటికే ఆ నోటా ఈ నోటా ఈ విషయం బయటకు వ్యాపించింది. కాగా, ఈ నాణేలు 1911 సంవత్సరానికి చెందిన విక్టోరియా మహారాణి పేరు మీద ముద్రించి ఉన్నాయని, ఇవి అరుదైనవని చరిత్రకారులు చెబుతున్నారు.

### క్షేత్రస్థాయి పోరాటానికి సిద్ధమవుతున్నాం



నేను గతేడాది జూన్‌లో రిటైర్ అయ్యాను. మోకాళ్ల నొప్పులతో సతమతం అవుతున్నా. గతేడాది డిసెంబర్‌లో మోకీలు మార్పిడి చేయించుకున్నా. అప్పు తెచ్చి చెల్లించా. ఇంత వరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదు. నాలాగే వందల మంది రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్ రాక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించడం బాధాకరం. పదిహేను నెలలు గడుస్తున్నా తమకు బెనిఫిట్స్ ఇవ్వకపోవడం సరికాదు. వయసు మళ్లిన వారికి 'అనేక సమస్యలు ఉంటాయి. అనారోగ్యం, ఇతర బాధ్యతలు ఉంటాయి. అవి పూర్తి చేయాలి అన్న కనీస ఇంగిత జ్ఞానం ప్రభుత్వం లేకపోవడం సరికాదు. జీపీఎఫ్, కముటెడ్, ఎర్న్‌డ్ లీవ్స్, ఆఫ్‌పే సెలవులు అన్ని మా సొంతానికి చెందినవి. వాటిని ఇవ్వకపోవడం అన్యాయం. హైకోర్టు చెప్పినా సర్కార్ వైఖరి మారకపోవడం ఆశ్చర్యంగా ఉన్నది. అందుకే క్షేత్రస్థాయి పోరాటానికి సిద్ధమవుతున్నాం. అయినా ప్రభుత్వంలో స్పందన రాకపోతే మాకు చావులే శరణ్యం.

**- ఆరేటి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు (జగిత్యాల)**

### ఇంటి నిర్మాణం ఆగిపోయింది

జగిత్యాల జిల్లాకు చెందిన అందె శ్రీనివాస్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేసి 15 నెలల క్రితం రిటైర్డ్ అయ్యాడు. టీచర్‌గా, హెచ్‌ఎంగా పనిచేస్తున్న సమయంలో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, పిల్లల పెండ్లిల కోసం వచ్చిన వేతనాన్ని వెచ్చించాడు. రిటైర్ అయిన తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టాడు. ₹60 లక్షలకుపైగా బెనిఫిట్స్ వస్తాయని లెక్కలు వేసుకున్నాడు. వాటితో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని భావించాడు. కానీ ఏడాదిన్నర కావస్తున్నా బెనిఫిట్స్ రాకపోవడంతో ఇంటి నిర్మాణం నిలిచిపోయింది. అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం చేద్దామన్నా 'రిటైర్ అయ్యారు సార్. చెల్లింపులు ఇబ్బందవుతాయి. అప్పు ఇవ్వలేమని తెలిసిన వారు చెబుతుండడంతో శ్రీనివాస్ పూర్తిగా నీరుగారిపోయాడు. ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి, బెనిఫిట్స్ కోసం కోర్టు మెట్లెక్కాడు.



# రిటైర్డ్ ఉద్యోగుల సమర భేరి

## పదిహేను నెలలుగా అందని బెనిఫిట్స్

- పది వారాల్లో 24శాతం వడ్డీతో చెల్లింపులు జరపాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా సర్కారు బేఖాతరు
- కోర్టు ధిక్కారం కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు
- క్షేత్రస్థాయిలో నిరసనలు తెలిపేందుకు ప్రణాళికలు
- జగిత్యాల జిల్లాలో నేడు ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు ఏర్పాట్లు
- అయినా స్పందనలేకపోతే చావే శరణ్యమంటున్న పెన్షనర్లు

**రిటైర్డ్ ఉపాధ్యాయులు సర్కారుపై పోరుబాట పడుతున్నారు. విరమణ పొంది పదిహేను నెలలు గడిచినా బెనిఫిట్స్ అందించకపోవడంపై సమరభేరి మోగించేందుకు సిద్ధమయ్యారు. ఆఫీసులు, ఉద్యోగ సంఘాల నాయకుల చుట్టూ తిరిగినా, చివరకు సీఎంను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. చేసేదేం లేక కొద్దిరోజుల క్రితం కోర్టు మెట్లెక్కితే.. పది వారాల్లో 24 శాతం వడ్డీతో కలిపి బెనిఫిట్స్‌ను చెల్లించాలని సర్కార్‌ను ఆదేశించినా పట్టించుకోకపోవడంతో ఇక తాడో పేడో తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. నేడు ప్రజావాణిల్లో ఫిర్యాదులు చేయాలని నిర్ణయించుకున్నారు. అయినా స్పందన రాకపోతే తర్వాత నిరసన తెలిపేందుకు కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.**

జగిత్యాల, జూన్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ప్రభుత్వం, రెండో దఫాలో తెలంగాణ ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతో ఉద్యోగుల విరమణ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరిగింది. కేసీఆర్ పెంచిన విరమణ వయసు వల్ల నిలిచిపోయిన రిటైర్మెంట్లు గతేడాది మార్చి 31తో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా 1800 నుంచి 2వేల మంది ఉద్యోగులు విరమణ పొందుతూ వస్తున్నారు. జగిత్యాల జిల్లాలో వెయ్యి మందికి పైగా ఉద్యోగులు విమరణ పొందారు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు, గ్రాట్యుటీ, కముటెట్, సరెండర్ లీవ్స్ ఇలా అన్నింటినీ కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందిస్తుంది. సహజంగానే ఉద్యోగి రిటైర్మెంట్ గడువు సమీపిస్తున్న తరుణంలోని సదరు ఉద్యోగికి సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వం సేకరించి, వాటి ఆధారంగా ఉద్యోగి విరమణ తదుపరి వారం పది రోజులు, గరిష్ఠంగా నెల వ్యవధిలో అన్ని ప్రయోజనాలను అందజేస్తూ వచ్చేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిటైర్మెంట్ అయిన తర్వాత ఉద్యోగులకు 15 నెలలు గడిచినా బెనిఫిట్స్‌ను ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి పదవీ విరమణ ప్రయోజనాలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. రిటైర్ అయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కేసుకొని పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం,తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్న వారు, సొమ్ము చేతికి అందుతుందనే భరోసాతో అప్పులు చేసి కార్యాలను గట్టెక్కించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏడాది దాటినా ఇంకా విరమణ సొమ్ము చేతికి అందకపోవడంతో సతమతమవుతున్నారు.

### హైకోర్టు తలుపు తట్టిన రిటైర్డ్ ఉద్యోగులు

బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం, ఎన్నిసార్లు విన్నపాలు, విజ్ఞప్తులు చేసినా కనికరించకపోవడంతో విసిగిపోయిన రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు హైకోర్టు తలుపు తట్టారు. జగిత్యాలకు చెందిన రిటైర్డ్ టీచర్లు ఆరేటి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణ ఇలా చాలా మంది హైకోర్టులో వ్యక్తిగతంగా కేసులు వేశారు. రిటైర్డ్ ఉద్యోగుల కేసులను కలిపి విచారణ చేసిన హైకోర్టు, బెనిఫిట్స్ అనేవి ప్రతి రిటైర్డ్ ఉద్యోగి హక్కు అని, వాటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తేల్చిచెప్పారు. పది వారాల వ్యవధిలో బెనిఫిట్స్‌ను 24 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే కోర్టు తీర్పు ఇచ్చి పన్నెండు వారాలు గడిచిపోయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ప్రభుత్వంపై కోర్టు ధిక్కార కేసు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

### నేడు జగిత్యాల ప్రజావాణిలో ఫిర్యాదు

ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో జగిత్యాలకు చెందిన రిటైర్డ్ టీచర్లు ఒక కార్యాచరణను రూపొందించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి విరమణ ఉపాధ్యాయులంతా హాజరై ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. తదుపరి నిరసనలు తెలియజేయడంతో పాటు ఇతర కార్యాచరణను తీసుకోవాలని నిర్ణయించారు. ముందుగా రిటైర్డ్ టీచర్లు మాత్రమే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని భావించినా, తదుపరి రిటైరయిన ప్రతి ఉద్యోగికి సమాచారాన్ని చేరవేశారు. పెద్ద సంఖ్యలో ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



### అప్పుల బాధతో అనారోగ్యం

జగిత్యాలకు చెందిన వెంకటరమణ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. సర్వీస్‌లో ఉండగా అతడికి ఉపాధ్యాయుడిగా వచ్చే వేతనం తప్ప మరో ఆదాయ మార్గం లేదు. వచ్చిన వేతనంతోనే పిల్లలకు చదువులు, చెప్పించాడు. రిటైర్మెంట్ వరకు ఆయన పెద్దగా కూడబెట్టలేదు. విరమణ పొందిన తర్వాత ఇద్దరు పిల్లల పెండ్లిలు చేశాడు. పెండ్లిలకు పెద్ద మొత్తంలోనే అప్పులు చేయాల్సి వచ్చింది. రిటైర్ అయి పదిహేను నెలలు గడిచినా ఇంత వరకు వెంకట రమణ సార్‌కు ₹60 లక్షల వరకు రావాల్సిన బెనిఫిట్స్ రాలేదు. అప్పుల వారి ఒత్తిడి పెరిగిపోవడంతో వెంకటరమణ అనారోగ్యానికి గురయ్యాడు. ఒకవైపు అప్పుల వాళ్లకు నచ్చచెప్పలేక, బెనిఫిట్స్ ఎప్పుడు వస్తాయో తెలియక సతమతం అవుతున్న వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించాడు. పదివారాల్లో బెనిఫిట్స్ ఇవ్వాలని కోర్టు తీర్పు చెప్పినా ఇంత వరకు డబ్బులు రాలేదు.

# వాన కోసం మొగులుకేసి..

## వానకాలం మొదలైనా జాడలేని వర్షాలు

- మొదట్లో జల్లులతో సాగు మొదలు పెట్టిన రైతులు
- ఇప్పుడు చినుకు లేక ఎదురుచూపులు
- గాలి, ఎండ తీవ్రతతో వాడుతున్న పత్తి మొలకలు
- ముదిరిపోతున్న నారు మడులు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

**రోహిణీకార్తె ముందే తొలకరి పలుకరించింది.. దీంతో నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ఉన్నాయనే ఆశతో రైతాంగం సాగుకు సన్నద్ధమైంది.. కానీ, ముందస్తుగా దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేసిన.. నార్లు పోసిన కర్షకుల పరిస్థితి దారుణంగా తయారైంది. పదిహేను రోజుల నుంచి వానల జాడ లేక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. నాటిన పత్తి విత్తనాల్లో కొందరివి మొలకెత్తి చిగురించగా, మరికొందరివి మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసిసాగు చేస్తే విత్తనాలు మొలకెత్తలేవని, కాస్తోకూస్తో మొలిచినవి గాలి, ఎండ తీవ్రతతో వాడిపోతున్నాయని దిగాలు చెందుతున్నారు. పోసిన నార్లు ముదిరిపోతున్నాయని వాపోతున్నారు. సకాలంలో వానలు పడకపోతే తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.**



హుజూరాబాద్ రూరల్: వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతు

సారంగాపూర్ జూన్ 22 : వానకాలం ఎంత త్వరగా విత్తనాలు వేస్తే అంత మంచిదని.. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల బారినపడకుండా పంట చేతికి వస్తుందని రైతుల నమ్మకం! అయితే మేలో వర్షాలు పడడంతో రైతుల్లో సంబురపడ్డారు. ఈ నెల మొదటి నుంచి అంటే.. పదిహేను రోజుల క్రితం నుంచే దుక్కులు దున్ని సాగు ప్రారంభించారు. పత్తి విత్తనాలు వేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విత్తనాలు నాటిన రైతులు, ఇప్పటికే విత్తనాలు, దుక్కిదున్నినవి, కూలీల ఖర్చులు కలిపి దాదాపు ఎకరానికి సుమారు ₹12వేల వరకు పెట్టారు. ఇప్పుడు వరుణుడి జాడ కోసం ఎదురుచూస్తున్నారు. మొలకెత్తిన విత్తనాలను కాపాడుకోలేక తండ్లాతున్నారు. నీళ్లు లేక మొలక భూమిలోనే ఎండిపోతుండగా కంటతడి పెడుతున్నారు. విత్తనాలు మొలకెత్తని చోట మరోసారి నాటాల్సి వస్తుందని చెబుతున్నారు. బోర్లు, బావులు ఉన్న చోట కొందరు విత్తనాలకు నీరు అందిస్తున్నప్పటికీ, ఆ సౌకర్యం లేని చోట వర్షం కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇటు రోహిణి కార్తెలోనే కొందరు అన్నదాతలు నార్లు పోశారు. నార్లు ఏపుగా పెరిగినా నాట్లేసేందుకు నీళ్లు లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వారంలోనైనా పడకపోతే పెట్టుబడి కూడా నష్టపోతామని వాపోతున్నారు. సొంత భూముల్లో విత్తనాలు వేసిన రైతుల పరిస్థితి ఇలా ఉంటే, కౌలు తీసుకున్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని చెబుతున్నారు. అయితే కొందరు ఇప్పటి వరకు ఇంకా సాగు మొదలు పెట్టలేదు. వానలు ఎప్పుడొస్తాయా.. అని ఎదురుచూస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభించిన తర్వాత ప్రాజెక్టులను, చెరువులను ముందుగానే నింపిందని, దాంతో నీళ్లకు ఇబ్బంది ఉండేది రాలేదని చెబుతున్నారు. కాలం కలిసి రాకున్నా మొగులుకేసి చూసి పరిస్థితి ఉండేది కాదని, పొలాలకు పుష్కలంగా నీళ్లు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. రాజకీయాలు పక్కన పెట్టి మేడిగడ్డ వద్ద పిల్లర్‌ను బాగు చేసుంటే ఇవాళ పరిస్థితి వేరేలా ఉండేదని అభిప్రాయ పడుతున్నారు. కరువు పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టును వాడుకునే పరిస్థితి ఉండేదని, వర్షాలు పడినప్పుడు గోదావరితో ప్రాజెక్టులను నింపుకొనే వీలుండేదని చెబుతున్నారు.

### స్ప్రింక్లర్లతో పత్తికి నీరు



నాకున్న నాలుగెకరాలతోపాటు మరో ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి విత్తనాలు పెట్టిన. తొలకరించి పలుకరించి పదిహేను దాటినా వాన పడడంలేదు. రోజు ఉరుముతున్నది గానీ వానలు పడ్తలేవు. వారం కింద పెట్టిన పత్తి విత్తనాలు మాడిపోతాయేమోనని నాలుగెకరాలల్ల స్ప్రింక్లర్ల సాయంతో నీటిని అందిస్తున్న. మిగతా ఎనిమిదెకరాల్లో పెట్టిన విత్తనాలు మొలకెత్తలేదు. మొదట్ల విత్తనాలు పెట్టి అన్నివిధాలా నష్టపోయిన.

**- గుండేకార్ల కిషన్, యువ రైతు (మామిడిపల్లి)**

### పదికెరాల్లో పత్తి సాగు చేసిన



గత నెలలో వర్షాలు పడినయి. దాంతో ముందస్తుగా విత్తనాలు పెట్టిన. నాకున్న ఏడెకరాలతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసిన. విత్తనాలు పెట్టినప్పటి సంది ఇప్పటి వరకు వానలు పడ్తలేవు. కొన్ని విత్తనాలు మొలువగా, మరికొన్ని మొలువలేదు. విత్తనాల రేటు, పెట్టుబడి భారీగా పెరిగింది. వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయే దుస్థితి ఉన్నది.

**- బోరిగాయ మధు, యువ రైతు (మంగళ్లపల్లి)**

### జూలై చివరి వరకు విత్తుకోవచ్చు



జిల్లాలో ఈ వానకాలం సీజన్ ప్రారంభమై 15రోజులు గడిచింది. ఆదిలో వర్షం కురిసి మళ్లీ జాడకుండా పోయింది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జూలై నెల చివరి వరకు కూడా పత్తి విత్తనాలు పెట్టవచ్చు. రైతులు తొందరపడకుండా వ్యవసాయ విస్తరణాధికారుల సూచనలు పాటించాలి.

**- సందీప్, ఏవో (కోనరావుపేట)**

కోనరావుపేటలో స్ప్రింక్లర సాయంతో పంటకు నీటిని అందిస్తున్న రైతులు





పాట పాడుతున్న వందేమాతరం శ్రీనివాస్, మధుప్రియ, విద్యార్థుల ప్రదర్శన

## 'శాతవాహన'లో వార్షికోత్సవ సంబురం

కమాన్‌చౌరస్తా, జూన్ 22: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఆన్యువల్, స్పోర్ట్స్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. వీసీ ఉమేశ్‌కుమార్, సీఎస్ఐఆర్ – ఐఐసీటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సంగీత దర్శకుడు గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ఆదివారం ఈ వేడుకలకు హాజరై ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. వందేమాతరం శ్రీనివాస్, గాయని మధుప్రియ పాటలకు విద్యార్థులు చిందులు వేశారు. కల్చరల్ నైట్ వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.



బహుమతులతో విద్యార్థులు

## అక్రమ అరెస్టులపై ఆగ్రహం

ఓదెల, జూన్ 22: కాంగ్రెస్ సర్కారు అక్రమంగా కేసులు పెడుతున్నదని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఓదెల మండల కేంద్రంలో రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ, ఇటీవల సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసులు పెట్టారని, అయితే కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. పోలీసులు ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే నియంత్రించలేని పోలీసులు.. బీఆర్‌ఎస్ నాయకులపై మాత్రం ప్రతాపం చూపుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోవిందుల ఎల్లస్వామి, బండ నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.



ఓదెల: రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు